# రామాయణము-జైనబౌద్ధగ్రంథములు.

కిళాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

---

రామాయణమునందలి కథను జైనులును బౌద్ధులును తమమతానుగుణ్యమగు మార్పులతోఁ గైకొనిరని మనము తెలిసికొనవలసియున్నది. బౌద్ధుల జాతకకథలయందు రామాయణకథయు, దశరథుని శాపవృత్తాంతమును, ఋష్యశృంగునికథయుఁగలవు. దశరథజాతకమునకును రామాయణేతివృత్తమునకుఁ జాల భేదముగలదు. దశరథుని శాపవృత్తాంతము ననుసరించు కథయొకటి సామజాతకమునఁ గలదు (Jataka Stories No. 540). సాముఁడను ఋషికుమారుఁడొకఁడు, అంధులగు తనపితరుల సేవించుచుండెను. కాశీరాజగు పిలియక్షుఁడు మృగయావినోదియై బాణముతో నాతనిఁగొట్టెను. సాముఁడును శాంతుఁడై తనతలిదండ్రులకై విచారించి యాతనికి వారుండుచో టెఱింగించి మూర్ఛనొందెను. రాజందలకు విచారింపుచుండ నాయరణ్యదేవత సాముని తలిదండ్రులను భక్తిశ్రద్ధలతోఁ గొలిచిన నతని పాపము తొలఁగునని పలుకును. ఆసార్వభౌముఁడంత జలఘటంబుఁ గొని వారిం జేరి తన్నెఱింగించుకొని, వారొసంగిన సపర్యలనొంది, కుమారునిమరణమును వారికిఁ దెలుపును. వారు విషాదగ్రస్తులై తమ్మాతనిచెంతకుఁ గొనిపొమ్మని యాతని వేఁడిరి. సాముని మృతశరీరముచెంత వారు మంత్రములఁ బఠింప నిద్రఁజెందినవానివలె నాతఁడు పునర్జీవితుఁడయ్యెను. రాజాతని నాశ్రయించి యాతనివలన రాజధర్మముల నెఱింగి తన పట్టణమునకుఁ బోయెను.

మూలమునఁగల శాపవృత్తాంత మిటవిడువఁబడి, సామునియొక్కయు నాతని తలిదండ్రులయొక్కయు శాంతస్వభావమునకు, సత్ప్రవర్తనమునకుఁ బ్రాముఖ్య మొసఁగఁబడినది. ఋష్యశృంగునికథయు రెండుజాతకములఁ గలదు (No. 523, 526). నళినికాజాతకమున ఋష్యశృంగుఁడు (పాళీలో ఇసిసింగుఁ డని కలదు). అలంబుస యను నచ్చరకన్నె

మాయలంకకు మోహితుఁడాయెనని కలదు. రామాయణమునఁగల శాంతావృత్తాంత మిందు లేదు. ఋష్యశృంగుఁడొక యాఁడు లేడికి జన్మించి నొక ఋషి దయార్ద్రచిత్తుఁడై యాతనిఁ బెంచె నని కలదు. ఈవృత్తాంతమే బార్హట్ (Barhut Stupa) స్తూపమునఁ జిత్రింపఁబడినది.

జైనులును రామాయణకథను మార్చి వివిధకావ్యముల రచించిరి. అందుఁ బ్రాచీనమగునది విమలసూరి రచితమగు పఉమచరియ(పద్మచరిత) మనునది. ఈగ్రంథము మహావీరుని నిర్వాణానంతరము 530 సంవత్సరములకు రచింపఁబడె నని యందే తెలుపఁబడియున్నది. ఇది జైనమహారాష్ట్రి యనుప్రాకృతభాషలో నార్యావృత్తములలో రచింపఁబడెను. రాముఁడే పద్ముఁడు. వాల్మీకిరామాయణమున నసత్యములు పెక్కులుండుటచే మహావీరుని శిష్యుఁడగు గౌతముఁడు బింబిసారునికిఁ దెలిపినరీతిని దా నాగ్రంథమును రచించితి నని కవి గ్రంథాదిని వ్రాసెను. వానరుల నొక మానవజాతిగ వర్ణించుట పొసఁగదని వారు విద్యాధరవంశజు లనియు, గృహపట్టణద్వారములందును కేతనములందును కపిచిహ్నమునుంచుటచే వారు వానరులని పిలువఁబడిరని కవి యుత్ప్రేక్షించియున్నాఁడు. రావణాదులును రాక్షసులుగారు. విద్యాధరులపాలనమున నుండిరి. రావణునితల్లి యాతనికంఠమున నొకముక్తాహారము నుంచెననియు నందాతని శిరస్సు తొమ్మిదిసారులు ప్రతిబింబితమగుటచే నాతఁడు దశగ్రీవ దశానన శబ్దవాచ్యుఁడాయెననియు గల్పింపఁబడినది. అతఁడొక గొప్పజైనభక్తుఁడు. జైనదేవాలయములఁ బునరుద్ధరణ మొనర్చెను. హనుమంతుఁ డతనికి యుద్ధములసహాయ మొనర్చెను. దశరథున కనంతరథుఁ డనుసోదరుఁడుండెను. అతఁడు వార్ధక్యమున రాజ్యమును విడిచి జినభక్తుఁడయ్యెను. దశరథునకు అపరాజిత, సుమిత్ర, కైకేయి యనుముగ్గురుభార్యలు కలరు. అందపరాజితకు, పద్ముఁ డను రాముఁడును, సుమిత్రకు లక్ష్మణుఁడును, కైకేయికి భరతశత్రుఘ్నులును జన్మించిరి. సీతయు నాఁగటిచాలున దొరకియుండలేదు. జనకునకు నాతని భార్యయగు విదేహకును బుట్టిన కూఁతురు. వా రామెను పద్మునకు వివాహము చేయ నిశ్చయించిరి. కాని

విద్యాధరులరాజగు చంద్రగతి యను నాతఁడామెకొఱకువచ్చి తనకార్ముకమును జనకునకు నొసఁగెను. దానిని భంగమొనర్చిన రాకొమరునకు సీత నిచ్చెదనని జనకుఁ డనెను. పద్మఁడు ధనుర్భంగమొనర్చి సీతం బెండ్లియాడెను. తరువాతివృత్తాంతమునఁగూడ నిట్టిమార్పులు పెక్కులు గలవు. భరతు నతనితల్లియగు కైకేయియు, సోదరుఁడగు పద్మఁడును రాజ్యమును గైకొనుమని యాజ్ఞాపింప నాతఁడు పద్మఁడు మరల వచ్చువఱకు రాజ్యము నేలుట కంగీకరించును. సీతాపహరణము, హనుమంతుని యన్వేషణము, రావణవధ, సీతాసమాగమము, పౌరులామెను దోషిగఁ దలఁచుట, వనవాసము, కుశలవుల జననము మొదలగునవి పెక్కుఉపాఖ్యానములతో వర్ణింపఁబడినవి.

విమలసూరి యొక్క కథయే తరువాతి రామకథలకు మూలముగ నుండెను. దాని ననుసరించియే రవిసేనుఁడు తనపద్మపురాణమును క్రీ. శ. యేడవశతాబ్దమున రచించెను (678 A. D). ఇందును రాముఁడు పద్మఁడని పేర్కొనఁబడియెను. కుశలవులు లవణాంకుశులయిరి. జీవహింసమాంసాహారవర్జనము, మొదటి జైనతీర్థంకరుఁడగు ఋషభుని మహిమానువర్ణనము మొదలగువిషయములు చాలఁగలవు. ఈరామకథయే గుణాఢ్యుని యుత్తరపురాణమున నఱువదియెనిమిదవపర్వమునఁ గలదు.

హేమచంద్రుఁడు (పండ్రెండవ శతాబ్దము) తన త్రిషష్ఠిశలాకాపురుష చరిత్రమున నేడవపర్వమున నీకథను మఱల రచించెను. దీనినే హేమచంద్రుని రామచరితమనియు, జైనరామాయణమనియుఁ బిలుతురు. అదియు రాక్షసవానరుల వృత్తాంతములతోఁ బ్రారంభమగును. నాల్గవసర్గము మొదలు పదియవ సర్గాంతమువఱకు సీతారామలక్ష్మణులకథ వర్ణింపఁబడినది. ఈగ్రంథము ననుసరించియే పదునాఱవశతాబ్దము రాజవిజయసూరి శిష్యుఁడగు దేవవిజయగణిచే రామచరితమను గద్యకావ్యము రచింపఁబడినది. కృష్ణదాసుని పుణ్యచంద్రోదయ పురాణమను మఱియొక గ్రంథము కూడఁ గలదని రాజేంద్రలాలుమిత్రగారు వ్రాసియున్నారు.